
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



కర్ణాటక వార్తలు

శుక్రవారం 25 ఏప్రిల్ 2025



నివాళి అర్పిస్తున్న మంత్రి సోమణ్ణ, ఎంపీ తేజస్వీ సూర్య

మంజునాథ్ (ఫైల్)





అరాచకం

భరత్ భూషణ్ (ఫైల్)



● ఉగ్రవాదులు క్రూరంగా ప్రవర్తించారు ● మూడేళ్ల బిడ్డ ఉందని వేడుకున్నా: భరత్ భూషణ్ భార్య ఆవేదన ● భర్తతోపాటు నన్నూ చంపేయండని కోరా..: మంజునాథ్ భార్య



మూడేళ్ల బిడ్డ ఉందని వేడుకున్నా వదల్లేదు : సుజాత, భరత్ భార్య

పహల్గాం పచ్చిక బయళ్లలో చిన్నారితో పాటు సరదాగా ఆడుకుంటున్నాం. అంతలోనే వచ్చిన ఉగ్రవాదుల భరత్ భూషణ్‌ను కాల్చేందుకు ప్రయత్నిస్తుండగా మూడేళ్ల బిడ్డ ఉంది.. వదిలిపెట్టాలని కోరినా క్రూరంగా వ్యవహరించారని భరత్‌భూషణ్ భార్య డాక్టర్ సుజాత రోదించారు. అక్కడి సంఘ టనను ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వివ రిస్తూనే ఆమె బాధతో తల్లడిల్లారు. ఆమెను సీఎంతో పాటు బంధువులు ఓదార్చారు. 18న కశ్మీర్‌కు వెళ్లామని 22న వెనుదిరిగి రావాల్సి ఉండేదన్నారు. తన భర్త కళ్లెదురుగానే కన్ను మూశారని ఆవేదన వ్యక్తం చేసింది.



కుటుంబ సభ్యులతో భరత్ చివరి ఫొటో..

బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బిడ్డ ఉంది వదిలేయండి అన్నా వదల్లేదు..కనికరం లేకుండా కర్కశంగా ప్రవర్తించారు..అంటూ ఆ మహిళలు కన్నీరు మున్నీరయ్యారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు అత్యంత క్రూరంగా వ్యవహరించారు. రాష్ట్రం నుంచి విహార యాత్రగా వెళ్లిన ఇద్దరు పౌరులను అత్యంత దుర్మార్గంగా ఉగ్రవాదులు కాల్చి చంపారని కుటుంబ సభ్యులు వాపోయారు. కశ్మీర్‌లోని పహల్గాంలో అమరులైన పర్యాటకుల మృతదేహాలు గురువారం బెంగళూరు విమానాశ్రయానికి చేరుకోగా గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్, ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తదితరులు నివాళి అర్పించారు. విమానాశ్రయానికి గురువారం తెల్లవారు జామున 5గంటలకు పార్థివదేహాలు కార్గో విమానంలో తీసుకురాగా కేంద్రమంత్రి సోమణ్ణ, బీజేపీ తేజస్వీ సూర్య ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. అమరులైన పౌరుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం శివమొగ్గకు చెందిన మంజునాథ్‌రావ్ పార్థివదేహాన్ని తుమకూరు మీదుగా శివమొగ్గకు తరలించారు. ఇక భరత్‌భూషణ్‌ను బెంగళూరు నగరం మత్తికెర ప్రాంతానికి తరలించారు. భరత్‌భూషణ్ పార్థివదేహాన్ని గవర్నర్, సీఎంలు సందర్శించి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. భరత్‌భూషణ్ పార్థివదేహాన్ని కడచూపు చూసేందుకు భారీగా జనం తరలివచ్చారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



భరత్ భూషణ్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న గవర్నర్ గెహ్లాట్



మంజునాథ్ కుమారుడిని తరలిస్తున్న స్థానికుడు

నన్నూ చంపమన్నా : పల్లవి, మంజునాథ్ భార్య

శివమొగ్గకు చెందిన వ్యాపారి మంజునాథ్ రావ్ కుమారుడు పీయూసీ ఉత్తీర్ణులు కావడంతో సరదాగా గడిపేందుకు కశ్మీర్‌కు వెళ్లామని మంజునాథ్ భార్య పల్లవి తెలిపింది. తినుబండారాలు కొనుగోలు చేసేందుకు కుమారుడితో పాటు మంజునాథ్ వెళ్లిన సమయంలోనే దుర్మార్గులు క్రూరంగా వ్యవహరించారన్నారు. తన భర్తతో పాటు తన కుమారుడిని చంపాలంటూ కోరామన్నారు. కానీ దుర్మార్గులు ఇదే విషయాన్ని ప్రధాని మోదీకి చెప్పాలంటూ హెచ్చరించారన్నారు. కాసేపటికి కొందరు స్థానికులు వచ్చి మమ్మల్ని ఇతర ప్రాంతానికి తీసువచ్చారన్నారు. నిమిషాల వ్యవధిలోనే దారుణం జరిగిందన్నారు. ఉగ్రవాదులను అంతం చేయాలంటూ గద్గద స్వరంతో ఆమె రోదించారు.

178 మంది సురక్షితంగా బెంగళూరుకు..

దుర్మార్గుల హింసాత్మకం తర్వాత కశ్మీర్ ప్రాంతంలో చిక్కుకున్న 178మంది కన్నడిగులను సురక్షితంగా బెంగళూరుకు తీసుకువచ్చారు. కార్మికశాఖా మంత్రి సంతోష్‌లాడ్ రెండురోజులుగా కశ్మీర్‌లోనే అధికారుల బృందంతో కలిసి కన్నడిగులను గుర్తించారు. వారందరినీ గురువారం బెంగళూరుకు తీసుకువచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచి కశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో గడిపేందుకు వెళ్లిన కన్నడిగులను గుర్తించారు. వారందరినీ సురక్షితంగా శ్రీనగర్ విమానాశ్రయానికి తీసుకువచ్చి అక్కడి నుంచి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. బంధుమిత్రుల కోసం వందలాది మంది విమానాశ్రయానికి వచ్చి స్వాగతించారు. ఎటువంటి ప్రమాదం లేకుండా బంధువులు వెనుదిరిగి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సంతోష్‌లాడ్‌తో పాటు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, అధికారులను వెనుదిరిగి వచ్చిన వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



క్షేమంగా తిరిగొచ్చిన విజయపుర వాసులు..

పడుకుని తప్పించుకున్నాం..

పహల్గాంలో కాల్పులు జరిగిన 500 మీటర్ల దూరంలోనే ఉన్నాం భారీగా శబ్దం రావడంతో భయపడి కింద పడుకుని ప్రాణాలు కాపాడుకున్నామంటూ విజయపురకు చెందిన న్యాయవాది మల్లికార్జున బ్యాంగిమఠ తెలిపారు. బెంగళూరుకు వెనుదిరిగి వచ్చాక ఘోర అనుభవాన్ని పంచుకున్నారు. చిక్కమగళూరుకు చెందిన రామేశ్వరకాలనీకు చెందిన ఐదుమంది కుటుంబ సభ్యులు బయటపడ్డామన్నారు. మాతో పాటు ఉత్తరకన్నడ జిల్లా శిరసి పట్టణం ఓమి ట్రావెల్స్ ద్వారా వచ్చిన 32మంది సురక్షితంగా వాపసువచ్చామన్నారు.



అడ్వకేట్ మల్లికార్జున కుటుంబం

పహల్గాం అమరులకు కేబినెట్ సంతాపం

● ప్రాంతాల వారీగా ఇకపై మంత్రివర్గ భేటీలు ● రూ.3,647 కోట్ల పనులకు ఏకగ్రీవ ఆమోదం

బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో కిరాతక ఉగ్రవాదుల చేతిలో అమరులైన పర్యాటకులకు కేబినెట్ సంతాపం తెలిపింది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన చామరాజనగర్ జిల్లా మలెమహదేశ్వర కొండలపై గురువారం మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్‌లో ఉగ్రవాదుల చేతిలో బలైన పర్యాటకులందరికీ మంత్రులు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం కేబినెట్ తీర్మానాలను సీఎం సిద్దరామయ్య తోటి మంత్రులతో కలిసి మీడియాకు వివరించారు. క్రైస్తవ ధర్మ గురువు పోప్ మృతికి శ్రద్ధాంజలి ఘటించామన్నారు. ఇకపై ప్రాంతాల వారీగా కేబినెట్ సమావేశాలు జరుపుతామన్నారు. ఇప్పటికే కలబురిగిలో సమావేశం నిర్వహించామని, ప్రస్తుతం మైసూరు ప్రాంతానికి సంబంధించి మలేమహదేశ్వర కొండలపై జరిపామని, బెళగావి రీజన్‌కు సంబంధించి బిజాపూర్‌లోను బెంగళూరు ప్రాంతానికి సంబంధించి నందికొండలపైనా మంత్రివర్గ సమావేశాలు జరుపుతామన్నారు. రూ.3647.42 కోట్ల విలువైన పనులకు కేబినెట్‌లో తీర్మానించామన్నారు. ప్రజాపనులు, చిన్న నీటిపారుదల, విద్యుత్, ఆరోగ్యశాఖలకు సంబంధించి భారీగా పనులు మంజూరు చేశామన్నారు. రూ.1787 కోట్ల విలువైన జలవనరుల పనులు చేపట్టామన్నారు. చెరువుల అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. వన్యప్రాణుల నుంచి రక్షణకు రూ.210 కోట్లతో రైల్వే బారికేడ్ల పనులు పూర్తీ చేశామన్నారు. తాగునీటికి రూ.315 కోట్ల పనులకు ఆమోదం తెలిపామన్నారు. పర్యాటక అభివృద్ధికి రూ.300 కోట్లు, కొళ్ళేగాల ఆసుపత్రిని 250 పడకల సామర్థ్యానికి పెంచుతామన్నారు. వరుణ పరిధిలో అంతర్జాతీయ క్రీడామైదానానికి భూమి మంజూరుకు అంగీకరించారు.

అనంతరం మలెమహదేశ్వర ఆలయ ప్రాధికార సభ జరిపారు. మలె మహదేశ్వర కొండల ప్రాంతాల్లో సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామన్నారు. ఇక్కడి భక్తులకు తిరుమల తరహాలో ప్రసాదం లడ్డు తయారీకు నందిని నెయ్యిని వాడుతామన్నారు. ఏకకాలంలో 4వేల మంది భక్తులు ప్రసాదం స్వీకరించే భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రతా చర్యలు పెంచేలా తీర్మానించామన్నారు. చామరాజనగర్ జిల్లాకు ముఖ్యమంత్రి వస్తే పదవి పోతుందని గతంలో పలువురు జిల్లాను సందర్శించలేదన్నారు. 2015లో సీఎంగా ఉన్నపుడు వచ్చానని రెండోసారి ప్రభుత్వం నడుపుతున్నట్లు తెలిపారు.



కేబినెట్ సమావేశంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే

ఇక సొమ్ము భద్రం..!

● ఫైనాన్స్ రంగంలోకి సర్కారు ● పల్లె ప్రాంతాల్లో మైక్రో చిట్స్
● ఏడాదికి రూ.40-50వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం
● 6 లక్షల స్వయం సంఘాల భాగస్వామ్యం

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్లు రెట్టింపు, భారీ వడ్డీల ఆశ చూపి ఎక్కడికక్కడ కోట్ల రూపాయలు ముంచేసి పరారీ అవుతున్న సంఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. మరోవైపు లోన్‌యాప్‌లు, కాసు వడ్డీ, చక్రవడ్డీల పేరిట సామాన్యులను ఎక్కడికక్కడ జలగల్లా పట్టి పీడిస్తున్నారు. రోజువారీ కూలి, వ్యాపారం, ఇతరత్రా వ్యవహారాలతో సంపాదనను ఎలా నిల్వ ఉంచుకోవాలో తెలవకుండా స్థానికంగా చీటీలు వేస్తారు. ప్రతి పల్లెకు ఐదారుమంది చీటీలు వేస్తున్నా అందులో పంగనామాలు పెట్టి పరారీ అయ్యేవారు ప్రతిసారి తెరపైకి వస్తుంటారు. ఇలాంటి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

'సురక్షిత పెట్టుబడి - తక్షణ సాయం'

సామాన్యుల ఆదాయాన్ని పెట్టుబడిగా మార్చేందుకు ప్రభుత్వమే కొత్త విధానాన్ని తీసుకురానుంది. పాల ఉత్పత్తిదారులు, గృహలక్ష్మీ లబ్ధిదారులతో పాటు 6లక్షలకుపైగా స్వయం సహాయక సంఘాలు రాష్ట్రంలో ఉన్నాయి. ఇలా ప్రతిసంఘంలోనూ 10మంది సభ్యులంటే కనీసం 60లక్షలమంది ఉంటారు. ఇక మిగిలిన లబ్ధిదారులు గృహలక్ష్మి, పాల ఉత్పత్తిదారులతో కలిపితే కోటిన్నరమందికిపైగా చేరుతారు. ఇలా ఆదాయంపొందే మహిళలను దృష్టిలో ఉంచుకుని సురక్షితమైన పెట్టుబడి, పొదుపును ప్రజల్లో ప్రేరేపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుబంధమైన మైసూరు సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) ద్వారా మహత్తరమైన పథకాన్ని రూపొందించింది. 'సురక్షిత పెట్టుబడి - తక్షణ సాయం' పేరిట భారీగా చిట్ వ్యవహారాల పథకం అమలులోకి తెచ్చేందుకు సీఎం సిద్దరామయ్య సిద్ధమయ్యారు.

ఏడాదికి రూ.40-50వేల కోట్ల లక్ష్యం

కోట్లాదిమంది మహిళల్లో నమ్మకం పెంచి వారి ఆదాయాన్ని పొదుపుగా భద్రపరుచుకునేందుకు సురక్షితమైన పెట్టుబడి పేరిట ప్రచారం చేయనున్నారు. తద్వారా ఏడాదికి రూ.40-50వేల కోట్ల రూపాయల మొత్తాన్ని మైక్రో చిట్స్ రూపంలో లావాదేవీలు చేపట్టాలని నిర్ణయించారు. కేరళ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ఆర్థికతను క్రియాశీలకంగా చేసేందుకు కసరత్తు జరుపుతున్నారు. ఆర్థిక నిర్వహణలో పారదర్శకత, పద్ధతి ప్రకారం అభివృద్ధి చేసేలాంటి సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. ఆధార్ ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకుని ఈ-కేవైసీ ఆధారంగా లబ్ధిదారుల రిజిస్ట్రేషన్‌కు, చిట్‌ఫండ్ నిర్వహణకు ఎంఎస్ఐఎల్ సంపూర్ణంగా సన్నద్ధమైంది.
మహిళలకు ప్రభుత్వ పథకాల అమలు కావడం ద్వారా వారిలో ఆర్థికపరమైన ఆలోచనలు పెరుగుతున్నాయి. రుణం తీసుకునేందుకు ఏ విధంగా ఆసక్తి చూపుతారో, చెల్లింపుల్లోనూ అంతే బాధ్యతగా మహిళలు వ్యవహరిస్తారనేది స్వయం సంఘాల ద్వారా రుజువైంది.
ఎంఎస్ఐఎల్ గడిచిన కొన్నేళ్లుగా చిట్‌ఫండ్ వ్యవహారాలు నడుపుతోంది. నగర ప్రదేశాలకు కేంద్రీకృతంగా ఏడాదికి రూ.500 కోట్ల రూపాయల లావాదేవీలకు పరిమితమైంది. దీంతో ప్రైవేట్‌గా చిట్‌లు, రెట్టింపు వడ్డీలు, వారం, నెలసరి ఫండ్‌లు వంటి వాటిని ప్రైవేట్‌వ్యక్తులు నిర్వహిస్తున్నారు. తరచూ చిట్‌ఫండ్ నిర్వాహకులు పరారీ అయ్యారని, రాత్రికి రాత్రి వెళ్లిపోయారని ఆత్మహత్య చేసుకున్నారనే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎంఎస్ఐఎల్ ద్వారా నిర్వహించడం ద్వారా నమ్మకం, సురక్షితం ప్రభుత్వానిదంటూ ప్రచారం చేయనున్నారు. తొలి రెండేళ్లలో 10వేల కోట్ల రూపాయల వ్యవహారాలు జరపతలపెట్టారు.

భద్రతకు ప్రాధాన్యం

నిధులు సేకరించడం, చిట్స్ వేయడంతోపాటు ప్రతి లావాదేవీ కూడా యాప్ ఆధారిత నిర్వహణగా ఉంటుంది. కోర్‌బ్యాంకింగ్ సొల్యూషన్స్ కంపెనీ ప్రాసెస్‌వేర్ ద్వారా ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. వెబ్ ఆధారిత నిర్వహణతో మొబైల్ యాప్ ద్వారా నెలవారీ కంతులు చెల్లించవచ్చు. డబ్బులు అవసరమైనప్పుడు చిట్స్ రూపంలోనే పొందవచ్చు. ఈ-కేవైసీ ఆధారిత లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, ఆధార్ ధ్రువీకరణ నుంచి చిన్నలోపానికి అవకాశం ఉండదని ఎంఎస్ఐఎల్ అధికారులు అభిప్రాయపడతున్నారు.

తాలూకాకు ఓ కేంద్రం

ప్రతి తాలూకాకు ఓ కేంద్రాన్ని తెరచి సంస్థ ప్రతినిధులను నియమించడం తోపాటు, స్వయం సహాయ సంఘాల మహిళల ప్రతినిధులనే చిట్‌ఫండ్ వ్యవహారాలకు బాధ్యతను అప్పగించాలని నిర్ణయించారు. గృహలక్ష్మి గ్యారెంటీ లబ్ధిదారుల సొమ్మును పొదుపుగా మార్చేందుకు గ్రూప్ లీడర్‌ల ద్వారా చైతన్యం కలిగించ దలిచారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలను పొదుపు వైపు తీసుకురావాలనేది ఆశయంగా ఉంది.

ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ఈ పథకంలో సభ్యులు చేయనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, బోర్డులు, కార్పొరేషన్‌ల అధికారులు, ఉద్యోగులకోసం రూ.50వేల నుంచి 25 లక్షల విలువైన చిట్ స్కీమ్‌లను పరిచయం చేయనున్నారు. హ్యూమన్ రిసోర్స్ మేనేజిమెంట్ సిస్టమ్ ఆధారిత డిజిటల్ రిజిస్ట్రేషన్‌లు, వేతనాలలో చెల్లింపులకు అవకాశం కల్పించదలిచారు. ఏప్రిల్‌లోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణి ఇంటిపై

ఈడీ దాడులు

● ఐశ్వర్యగౌడ, శిల్పగౌడ మోసం కేసులో కొనసాగుతున్న విచారణ

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పలుకుబడిన కుటుంబీకులమంటూ బంగార వ్యాపారులను మోసం చేసిన ఐశ్వర్యగౌడ, శిల్పాగౌడ కేసులకు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణి నివాసంపై గురువారం ఈడీ అధికారులు దాడి చేశారు. బంగారంతో పాటు పలు వ్యవహారాలలో ఐశ్వర్యగౌడ, శిల్పాగౌడలు భాగస్వామ్యులైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈమేరకు కోట్లాది రూపాయల వ్యవహారం చేసిన మేరకు విచారణ జరిపిన నగర పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. నగర పోలీసులు దర్యాప్తునకు అనుగుణంగా సేకరించిన ఆధారాల ప్రకారం ఈసీఐఆర్‌ను దాఖలు చేసుకున్న ఈడీ అధికారులు కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణితో పాటు పలువురిపై దాడి చేశారు. ఐశ్వర్య గౌడకు చెందిన విలాసవంతమైన కారును వినయ్‌కులకర్ణి ఉపయోగిస్తున్నట్లు పోలీసులు గతంలోనే ప్రకటించారు. అందుకు అనుగుణంగానే వినయ్‌కులకర్ణి నివాసంపై దాడికి పాల్పడినట్లు సమాచారం.

రోజూ మూడు కప్పుల కాఫీ మంచిదే..!

● నేటి నుంచి ఇండియా ఇంటర్నేషనల్ కాఫీ ఫెస్టివల్ ● హాజరు కానున్న 80కిపైగా కంపెనీలు



బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి రోజూ మూడుకప్పులు తాగడం ఆరోగ్యానికి మంచిదేనని పలు ఆరోగ్య నివేదికలు తేల్చాయని, బ్లాక్ కాఫీ మరింత ఉత్తమమని స్పెషాలిటీ కాఫీ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎం పూర్ణేష్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన ఇండియా ఇంటర్నేషనల్ కాఫీ ఫెస్టివల్ శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి సారి జరగనున్న ఈ ఫెస్టివల్‌లో 80మందికి పైగా ఎగ్జిబిటర్స్ పాల్గొంటున్నారన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కాఫీ పండిస్తున్నారని సుమారు రెండున్నరలక్షల హెక్టార్లలో సాగు అవుతోందన్నారు. ఇందులో 70శాతం కర్ణాటకలోనే సాగు చేస్తున్నారన్నారు. కాఫీ ఉత్పత్తిలో 70శాతం విదేశాలకు ఎగుమతి అవుతుండగా అందులో 50శాతం యూరప్ దేశాలకు వెళ్తోందన్నారు. దేశీయ కాఫీ ప్రధానంగా జర్మనీ, బెల్జియం, రష్యా, టర్కీలతో పాటు యుఏఈతో పాటు 120దేశాలకు ఎగుమతి అవుతుందన్నారు. కాఫీ బోర్డు ద్వారా కాఫీ ఉత్పత్తిదారులతో పాటు పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లకు రాయితీలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఫెస్టివల్‌లో 15 సెషన్‌ల చర్చాగోష్ఠులు ఉంటాయన్నారు. చామర వజ్రలో జరిగే కాఫీ ఫెస్టవల్‌లో పాల్గొనదలచినవారు ముందుగా టికెట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. మూడురోజుల ఫెస్టివల్‌కు కనీసం 15వేల మందికిపైగా సందర్శకులు పాల్గొంటారని అంచనా వేశామన్నారు.

ఘనంగా రాజ్‌కుమార్ జయంతి

8లో

కులగణనలో కమ్మవారికి అన్యాయం

● రాష్ట్రవ్యాప్తంగా 20లక్షలకుపైగా జనాభా ● వాస్తవాలు సరి చేసి ప్రకటించాలి: కమ్మసంఘం

బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పదేళ్ళకిందట నిర్వహించిన కులగణన సర్వేలో కమ్మవారి జనాభా తగ్గించారని వాస్తవాలకు అనుగుణంగా గణాంకాలను ప్రకటించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల విడుదలైన గణాంకాల ప్రకారం కమ్మవారికి తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. కమ్మవారిసంఘం అధ్యక్షుడు రాజగోపాలనాయుడు, మాజీ అధ్యక్షుడు కృష్ణంనాయుడుతో పాటు పలువురు గురువారం మీడియాతో మాట్లాడారు. కులగణన సర్వే ప్రకారం కమ్మ సంఘం 1,11,739 మంది , కమ్మనాయుడు 18,361, ఉపకులాలు 1745 కలిపి 1,50,601 మంది చూపారన్నారు. కమ్మవారి సంఘం ప్రకారం రాష్ట్రంలోని పది జిల్లాల్లో కమ్మవారు ఎక్కువగా నివసిస్తున్నట్లు తెలిపారు. సుమారు 20లక్షల మందికి పైగా కమ్మవారు ఉన్నారన్నారు. 34 ఉపకులాలతో కలిపి 3ఏ కేటగిరిలో 4శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ఇదే కేటగిరిలోని పలుకులాలు ఆర్థిక, రాజకీయంగా శక్తివంతులుగా ఉన్నారన్నారు. తద్వారా కమ్మకులస్తులకు అన్యాయం జరిగిందన్నారు. కమ్మకులస్తులను 1బీ కేటగిరిలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. కమ్మకులస్తుల న్యాయపరమైన డిమాండ్‌లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ప్రధానంగా బెంగళూరు నగరంతో పాటు బళ్ళారి, రాయచూరు, కొప్పళ జిల్లాల పరిధిలో అత్యధికంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కమ్మకుల ముఖ్యులు గారపాటి రామకృష్ణ, నీరజాక్షులు నాయుడు, యోగమూర్తి, లీలాశంకర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కమ్మ సంఘం నాయకుడు రాజగోపాల నాయుడు

క్రీడాయాప్‌తో నకిలీకి చెక్

డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సహాయంతో నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నామని ఉమ్మడి జిల్లా డీఎస్‌డీఓ (జిల్లా క్రీడాభివృద్ధి అధికారి) ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. రెండు జిల్లాలకు డీఎస్‌డీఓగా వ్యవహరిస్తున్న ఆయన క్రీడాశాఖలో అభివృద్ధి చేస్తున్న అంశాలపై వివరించారు.

ఇంటర్వ్యూ

ప్రశ్న: నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లకు ఎలా అడ్డుకట్ట వేస్తారు...?

డీఎస్‌డీఓ: ఆధార్‌నంబర్ ఆధారంగా ఎప్పుడు, ఎక్కడ ఏ క్రీడాపోటీల్లో పాల్గొన్నారో తెలుసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా క్రీడా యాప్‌ను తయారు చేసింది. దీని ద్వారా నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేయవచ్చు.

ప్రశ్న: అనంతపురం జిల్లాలో ఔట్‌డోర్ స్టేడియం నిర్మాణం ఎప్పుడు జరుగుతుంది?

డీఎస్‌డీఓ: నిర్మాణానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. ప్రజాప్రతినిధుల సహకారం, ఉన్నతాధికారుల ప్రమేయంతోనే అది సాధ్యం అవుతుంది.

ప్రశ్న: శ్రీసత్యసాయి జిల్లాలో క్రీడాస్టేడియాల నిర్మాణం పరిస్థితి ఏమిటి ?

డీఎస్‌డీఓ: ధర్మవరంలో హాకీ టర్ఫ్ ప్లేఫీల్డ్ నిర్మాణానికి మార్కెట్‌యార్డు సమీపంలో 9ఎకరాల స్థలాన్ని పరిశీలించాం. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి హామీ మేరకు ఈ హాకీ టర్ఫ్ ప్లేఫీల్డ్ నిర్మాణం చేపడుతాం.

ప్రశ్న: నీలం సంజీవరెడ్డి స్టేడియంలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు ఎలా ఉన్నాయి...?

డీఎస్‌డీఓ: ఈ స్టేడియంలో 60ఏళ్లుగా లక్షలాది మంది క్రీడాకారులు సాధన, శిబిరాలు నిర్వహించి ఎన్నో అద్భుత విజయాలు సాధించారు. ప్రస్తుతం కొన్ని అనివార్యకారణాలతో క్రీడాకారులకు కొంత అంతరాయం ఏర్పడిన మాట వాస్తవమే. సమన్వయంతో పరిస్థితిని సరిదిద్ది క్రీడాకారులకు అనుమతి పొందాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుకుంటాం.

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో క్రీడా స్టేడియాలు, సదుపాయాల పరిస్థితి ఎలా ఉంది?

డీఎస్‌డీఓ: 14 నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు స్టేడియాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం, శాప్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గానికి ఒక స్టేడియం నిర్మాణంపై తదుపరి కార్యాచరణ చేపడతాం.

ప్రశ్న: సమ్మర్ కోచింగ్ క్యాంపుల పరిస్థితి ఏమిటి...?

డీఎస్‌డీఓ: ఈ ఏడాది పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రభుత్వం-శాప్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో వంద కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని, ప్రతి క్యాంపులో 50మంది క్రీడాకారులను భాగస్వాములు చేయాలని నిర్ణయించారు. రెండు జిల్లాల్లో కలిపి మే 1 నుంచి 31 వరకు వంద వేసవి శిక్షణా శిబిరాల్లో 5వేల మంది క్రీడాకారులకు కోచింగ్ ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చారు.

ప్రశ్న: నిధులు దుర్వినియోగం చేసి నార్పల కోచ్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఎస్‌డీఓ: నార్పల స్టేడియంలో ఉన్న కోచ్ రమేష్ విధులకు గైర్హాజరవుతూ, నిధులు సొంతానికి వాడుకున్న అంశాలపై శాప్ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. భవిష్యత్తులో ఏ కోచ్ ఇలా నిధుల దుర్వినియోగానికి పాల్పడకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడాపాలసీ ఎలా ఉంది?

డీఎస్‌డీఓ: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన క్రీడాపాలసీ క్రీడలు, క్రీడాకారులకు ఎంతో మేలు కలిగించేలా ఉంది. క్రీడా రిజర్వేషన్‌తో క్రీడాకారుల్లో ఆసక్తి, ప్రోత్సాహం పెరిగింది. వచ్చిన అవకాశాలను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలి.

మొత్తం గేట్లు మార్చాల్సిందే

టీబీ డ్యాంపై తేల్చి చెప్పిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ

- తుప్పుపట్టి దెబ్బతిన్న గేట్ల అంచులు
- తుంగభద్ర బోర్డుకు నివేదిక అందజేత
- ఒక్కో గేటు ఏర్పాటుకు దాదాపు రూ.2కోట్ల వ్యయం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు 33కి కాలం తీరింది. మొత్తం గేట్లు మార్చాలని నిపుణులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే గత ఏడాది తరహాలో ఎప్పుడైనా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. డ్యాం గేట్ల పటిష్టతపై 'కాంప్రహెన్సివ్ హెల్త్ చెకప్' నిర్వహించిన చీరాలకు చెందిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ ఇదే విషయాన్ని సమగ్ర వివరాలతో టీబీపీ బోర్డుకు నివేదిక రూపంలో ఇచ్చింది. గత ఏడాది ఆగస్టులో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలకు తుంగభద్ర బోర్డు అధికారులు నివేదిక పంపించారు.

ఏపీ రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల శాఖ సలహాదారులు, సాగునీటి రంగ నిపుణులు కన్నయ్యనాయుడు నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం టీబీ డ్యాం గేట్ల పరిస్థితిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పాతగేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చే విధానంపై సమాలోచనలు చేశారు. కొత్త గేట్లను ఏర్పాటు చేయాల్సిందేనని ఇంజనీర్లు నిర్ణయించారు. దీంతో మొత్తం 33 గేట్లు మార్చేందుకు ఇంజనీర్లు ఉపక్రమించారు. ఇటీవల గేట్ల ఏర్పాటుకు సంబంధించి టెండర్లను కూడా పిలిచారు.



19వ క్రస్ట్‌గేట్‌కు ఏర్పాటు చేస్తున్న స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ (ఫైల్)

మూడు రాష్ట్రాలకు ప్రధాన నీటి వనరు

టీబీ డ్యాం ద్వారా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగు నీరు అందుతోంది. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాలకు టీబీపీ ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, కేసీ కాలువల ద్వారా తుంగభద్ర డ్యాం నుంచి 66.50 టీఎంసీలు నీటి వాటా ఉంది. ఖరీఫ్, రబీలో దాదాపు 7 లక్షల ఎకరాలకు సాగునీరు, కర్నూలు, ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో మెజార్టీ గ్రామాలకు తాగు నీరు అందించే ప్రధాన నీటివనరు ఈ ప్రాజెక్టు. 1953 నుంచి ఆయా రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాలు కాపాడున్న తుంగభద్ర డ్యాం ప్రస్తుతం ప్రమాదంలో పడింది. డ్యాం గేట్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించిన చీరాలకు చెందిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డుకు ఇచ్చిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. 2024 ఆగస్టు నెలలో వరద ఉధృతికి 19న నంబరు క్రస్ట్‌గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసింది. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో ఆ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ అప్పట్లో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఒక గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో మిగిలినవి భద్రమేనా అన్న సందేహాలు అప్పట్లోనే తలెత్తాయి. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నాయకత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ డ్యాం, గేట్లను సమగ్రంగా తనిఖీ చేశారు. గేట్ల జీవిత కాలం తీరిపోవడం వల్ల మరమ్మతులతో కాలయాపన చేయకుండా 33 గేట్లును మార్చాలని, గేట్ల ఏర్పాటులో అనుభవం కలిగిన సంస్థతో అధ్యయనం చేయించాలని సూచిస్తూ నివేదిక ఇచ్చింది.

శిథిలావస్థకు చేరిన గేట్లు

ఏకే బజాజ్ కమిటీ సూచన మేరకు తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అధికారులు టెండర్ల ద్వారా ఎంపిక చేసిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ క్షేత్రస్థాయిలో డ్యాంను తనిఖీ చేసింది. గత ఏడాది కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు మినహా.. మిగిలిన 32 క్రస్ట్‌గేట్లకు కాంప్రహెన్సివ్ హెల్త్ చెకప్ నిర్వహించింది. అల్ట్రా సోనిక్ స్కానింగ్ ద్వారా గేట్ల పటిష్టతను పరిశీలించారు. ఒక్కో గేటు వారిగా ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదికను కేఎస్ఎన్‌డీటీ సంస్థ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డుకు నివేదిక ఇచ్చింది. మెజార్టీ గేట్లు చివర అంచుభాగంలో 60 శాతానికి పైగా తుప్పు (కార్నర్ రస్ట్) పట్టాయని ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. మిగిలిన గేట్లైనా బాగున్నాయా..? అంటే అదీలేదు. ఆ గేట్లు కూడా కొన్ని గేట్లు 50 శాతం, మరికొన్ని గేట్లు 40 శాతానికిపైగా తుప్పు పట్టాయని తేల్చి చెప్పారు. వాస్తవంగా క్రస్ట్‌గేట్ల జీవిత కాలం 42 ఏళ్లే. తుంగభద్ర డ్యాం గేట్లు 72 ఏళ్లకు పైగా వినియోగిస్తున్నాం. ఏనాడో జీవిత కాలం తీరిపోయిన మొత్తం 33 గేట్లు మార్చాల్సిందే అని అధ్యయన సంస్థ ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ కమిటీ, కేఎస్ఎన్‌డీటీ సంస్థ ఇచ్చిన అధ్యయన నివేదికల ఆధారంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలకు, సీడబ్ల్యూసీకి తుంగభద్ర బోర్డు అధికారులు నివేదిక పంపించారు. కాగా.. ప్రస్తుతం ఉన్న గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయాలంటే.. ఒక్కో గేటుకు దాదాపుగా రూ.2 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ లెక్కన 33 గేట్లకు దాదాపు రూ.66 కోట్లకు పైగా నిధులు అవసరం ఉంది. అయితే.. పాతగేట్లను విక్రయించడం ద్వారా రూ.10 కోట్లు వస్తుందని అంచనా.

19వ గేటు ఏర్పాటుకు చర్యలు



గేట్లను పరిశీలిస్తున్న కన్నయ్యనాయుడు, ఇంజనీర్లు

గతేడాది కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటుకు ఇంజనీర్లు చర్యలు ప్రారంభించారు. గేటు ఏర్పాటు కోసం రూ.1.98 కోట్లతో టీబీపీ బోర్డు అధికారులు టెండర్లు నిర్వహించారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'హార్డ్‌వేర్ టూల్స్' సంస్థ 3.60 శాతం ఎక్కువ (ఎక్సెస్) రేట్లకు టెండరు దక్కించుకుంది. ఈ సంస్థ ఒక్కటే ఆన్‌లైన్ టెండరు వేసింది. ఈ సంస్థకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఫరక్కా బ్యారేజ్ గేట్లు ఏర్పాటు చేసిన అనుభవం ఉందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఆ సంస్థ ఇంజనీర్లు గత సోమవారం తుంగభద్ర డ్యాం, కొట్టుకుపోయిన 19వ గేటును పరిశీలించారు. గేటు తయారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ ఆఖరులోగా నూతన గేటు అమర్చాలని గడువు పెట్టారు. వచ్చే సీజన్ నాటికి అన్ని గేట్లు ఏర్పాటు చేయాలని ఇంజనీర్లు తలచారు.

టెండర్లు పిలిచాం..

టీబీ డ్యాం లోని అన్ని గేట్లను మార్చాలని టెండర్లను పిలిచాం. ఇప్పటికే తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల పటిష్టతపై చీరాలకు చెందిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ అధ్యయనం చేసింది. మొత్తం 33 గేట్లు మార్చాల్సిందేనని నివేదిక ఇచ్చింది. దాని ఆధారంగా ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలతో పాటుగా సీడబ్ల్యూసీకి లేఖ రాశాం.



\- నారాయణనాయక్, ఎస్ఈ, టీబీ డ్యాం

కొత్త గేట్ల ఏర్పాటు మంచిదే..



టీబీ డ్యాంలో పాతగేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జిల్లాకు మంచిదే. టీబీ డ్యాం సామర్థ్యం హెచ్చెల్సీపై ప్రభావం చూపుతుంది. గేట్లు పటిష్టంగా ఉండి టీబీ డ్యాంలో నీటి నిల్వ పెరిగితే జిల్లాకు వాటా కన్నా ఎక్కువగా తీసుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. హెచ్చెల్సీకి ప్రస్తుతం 32టీఎంసీల నీటి వాటా కేటాయింపు లు ఉన్నాయి. టీబీ డ్యాంలో నీటి నిల్వ పెరిగితే హెచ్చెల్సీకి వాటా కూడా పెరిగే అవకాశం ఉంది. అయితే వచ్చే సీజన్ నాటికి టీబీ డ్యాంలో కొత్త గేట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. కొత్త గేట్ల ఏర్పాటు పూర్తి అయితే టీబీ డ్యాం నుంచి కిందికి నీరు వృథాగా వెళ్ళే అవకాశం ఉండదు. దీంతో నీటిని నిల్వ చేసుకుని వినియోగించు కోవచ్చు.

\-రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ

ఉమ్మడి జిల్లాకు హెచ్చెల్సీయే ఆధారం

ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న హెచ్చెల్సీకి టీబీ డ్యాం నుంచే నీరు అందుతోంది. సుమారు 50ఏళ్లుగా టీబీ డ్యాం నుంచే అనంతపురానికి సాగు, తాగునీరు అందిస్తోంది. హెచ్చెల్సీకి టీబీ డ్యాంనుంచి ప్రస్తుతం 32టీఎంసీల నీటి వాటా కేటాయింపులు ఉన్నాయి. జిల్లాలో 1.5లక్షల ఎకరాల ఆయకట్టుకు హెచ్చెల్సీ ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఇక జిల్లాలో తాగు నీటి అవసరాలకు ప్రతి ఏటా 10టీఎంసీల వరకు హెచ్చెల్సీ ద్వారా తీసుకుంటున్నారు. డ్యాం భద్రంగా ఉంటేనే ముఖ్యంగా అనంత జిల్లా తాగు, సాగు నీటి అవసరాలు తీరుతాయి.

వేధిస్తున్న పశుగ్రాసం కొరత

- రైతులకు తప్పని తిప్పలు
- సబ్సిడీతో ప్రభుత్వం పంపిణీ చేయాలని వినతి



మడకశిర రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా పాడిపరిశ్రమపై రైతులు ఆధాపడి జీవనం సాగిస్తున్నారు. అయితే వేసవిలో ఎండలు అధికంగా ఉండడంతో పశువులకు గ్రాసం లేక పాడిరైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మడకశిర క్లస్టర్‌లో పశుగణాంకాల మేరకు పాడిపశువులు 50 వేలు, గొర్రెలు 4 లక్షలు, మేకలు 2 లక్షలు ఉన్నాయి. వేసవిలో ఎక్కడచూసినా భూములు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడా గ్రాసం కనపడటం లేదు. దీంతో పాడి రైతులు పశువులను తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పశుసంవర్థక శాఖను నిర్లక్ష్యం చేయడంతోనే నేడు పాడిరైతులకు ఇలాంటి గతి పట్టిందని రైతులు పేర్కొంటున్నారు. అధిక ధరతో పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీతో పశుగ్రాసం అందించాలి

వైసీపీ ప్రభుత్వంలో పాడి పరిశ్రమను నిర్లక్ష్యంచేసి నిర్వీర్యం చేశారు. దీంతో నేడు పాడిరైతులు పశుపోషణకు అనేక కష్టాలు పడుతున్నారు. ట్రాక్టర్ గడ్డి రూ.10 వేలతో రైతులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో పశుగ్రాసం కొరత ఉన్న సమయంలో పాడిరైతులు ఇబ్బందులు పడకుండా సైలేజ్ గడ్డిని పంపిణీచేశారు. ప్రస్తుతం కూడా గ్రాసం, దాణాను సబ్సిడీతో అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

\- రాజగోపాల్ రైతు బీ రాయాపురం



పొలంలో బిగించిన డ్రిప్ పరికరాలు

కొత్త ఆశలు..!

- సూక్ష్మ సేద్య పరికరాల సబ్సిడీ పెంచాలని రైతుల డిమాండ్
- నూతన మార్గదర్శకాల కోసం ఎదురుచూపు
- మూడు నెలలుగా కాలయాపన



డ్రిప్ పరికరాలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు సంబంధించి కొత్త మార్గదర్శకాల కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈసారైనా సబ్సిడీ పెంచుతారని ఆశలు పెట్టుకున్నారు. మార్గదర్శకాల జారీలో జాప్యమవుతోంది. దీంతో అన్నదాతలకు నిరీక్షణ తప్పట్లేదు. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై మూడువారాలు గడిచినా ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం. గత వైసీపీ సర్కారులో డ్రిప్ సబ్సిడీ తగ్గించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ఆర్థిక సంవత్సరంలో దానినే కొనసాగించారు. టీడీపీ హయాంలో అమలు చేసిన పాత సబ్సిడీ విధానాన్ని పునరుద్ధరించి, కరువు రైతులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. గతేడాది సబ్సిడీ పెంచలేదు. ఈ నేపథ్యంలో 10 నెలలుగా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా... డీడీలు కట్టేందుకు ఎక్కువ శాతం మంది రైతులు వెనుకంజ వేశారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్యటనలకు వెళ్లిన సమయంలో స్థానిక రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీ పెంచాలని కోరుతున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలోనైనా సబ్సిడీ పెంచి, న్యాయం చేస్తారని ఆశగా ఉన్నారు.



సబ్సిడీ పెంచాలని రైతుల వేడుకోలు

గతేడాది వైసీపీ సర్కారు అమలుచేసిన సబ్సిడీ ధరలే కొనసాగించడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో సూక్ష్మసేద్యం పరికరాలకు పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ ఇచ్చారు. వైసీపీ పాలనలో సూక్ష్మసేద్యం పరికరాల మంజూరుకు సంబంధించి గైడ్‌లైన్స్ మార్చారు. ఐదెకరాలదాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీని పూర్తిగా ఎత్తేశారు. ఇతర కేటగిరీల రైతుల తరహాలోనే సబ్సిడీపోను మిగతా డబ్బులు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ రైతులకు షరతు పెట్టారు. దీంతో అప్పట్లో కరువు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేయడంతో పాటు టీడీపీ హయాంలో అమలైన పద్ధతిలోనే మిగతా కేటగిరీల రైతులకు డ్రిప్ మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనైనా ఆ హామీని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. మరి ఏ మేరకు ప్రభుత్వం చొరవ చూపుతుందో వేచిచూడాల్సిందే.

టార్గెట్ కుదింపు..!

2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం జిల్లాకు భారీగానే డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్ విధించింది. ఉమ్మడి అనంత జిల్లాకు గతంలో అత్యధికంగా 23వేల హెక్టార్లదాకా లక్ష్యం విధిస్తూ వచ్చారు. ఇందులో అనంత జిల్లా 13వేల హెక్టార్లు ఉండింది. గతేడాది అంతకు రెట్టింపుగా జిల్లాకు 37,500 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు టార్గెట్ విధించారు. పెద్దసంఖ్యలో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. వైసీపీ సర్కారులో అమలు చేసిన సబ్సిడీనే కొనసాగించడంతో తమ వాటా డబ్బులు చెల్లించేందుకు వెనుకంజ వేశారు. ఈ పరిస్థితుల్లో గతేడాది జిల్లా టార్గెట్‌ను 18వేల హెక్టార్లకు కుదించారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 14,869 మంది రైతులకు 17,642 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేశారు. ఇందులో ఇప్పటిదాకా 13,048 మంది రైతులకు 15,462 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేశారు. ఇంకా 2,180 హెక్టార్లకు సరఫరా చేయాల్సి ఉంది. వాటిలో 8,888 మంది రైతులకు సంబంధించి 10,535 హెక్టార్లలో పరికరాలు బిగించారు.

త్వరలో మార్గదర్శకాలు వచ్చే అవకాశం



రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు సంబంధించి కొత్త మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉంది. గతేడాది విధించిన టార్గెట్ మేరకు రైతులకు డ్రిప్ పరికరాలు మంజూరు చేశాం. నెలాఖరులో డ్రిప్ మంజూరైన రైతులకుందరికీ పరికరాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. నూతన మార్గదర్శకాలు రాగానే ప్రభుత్వం నిర్ణయించే సబ్సిడీని అమలు చేస్తాం.

\-రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ

సారూ.. ఎక్కడుంటారు మీరు..?

- గ్రామాల్లో కనిపించని వీఆర్వోలు
- కార్యాలయాల చుట్టూ జనం ప్రదక్షిణ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కీలకమైన గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) అందుబాటులో ఉండటం లేదు. దీంతో ప్రజలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోలేదు. వీఆర్వోలు స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ భూసమస్యలు పేరుకు పోతున్నాయి. బొమ్మనహాళ్ మండలంలో 16 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. కొందరు వీఆర్వోలు గ్రామాల్లో కాకుండా తహసీల్దార్ కార్యాలయంలోనే పనులు చేస్తున్నారు. గ్రామాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు, భూ సమస్యల పరిష్కారం కోసం వ్యయప్రయాసలతో మండల కేంద్రానికి రావాల్సిన వస్తోంది. మండలంలో మొత్తం 16 పోస్టులకుగాను 10 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీఆర్వోలు కొరత ఉన్న గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వీరు ఏరోజు ఏ గ్రామంలో ఉంటారో తెలియక ధ్రువ పత్రాల కోసం మండల కేంద్రం, ఇతర గ్రామాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యార్థులు, రైతులు, ప్రజలకు అవసరమైన పత్రాలు పొందేందుకు వీఆర్వోల సంతకాలు తప్పనిసరి కావడంతో ఆలస్యమవుతోంది. గ్రామ స్థాయిలో భూ సమస్యలు, హద్దుల వివాదాలు, జాయింట్ ఎల్పీనెంబర్లు వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. సకాలంలో పరిష్కారం కాకపోవడంతో ఇవి జఠిలంగా మారుతున్నాయి. వైసీపీ పాలనలో జరిగిన భూ తప్పిదాలు కొత్త ప్రభుత్వంలోనైనా పరిష్కారమవుతాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వీఆర్వోలు ఒకరో, ఇద్దరో మండల కేంద్రంలో నివాసం ఉంటే.. చాలామంది బళ్లారి, అనంతపురం ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఎప్పుడు వస్తారో, ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు మండిపడుతున్నారు. కొందరు వీఆర్వోలు ఎంతో కొంత ఇస్తేగాని సంతకాలు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రెవెన్యూ కార్యాలయం వద్ద ఎదురుచూస్తున్న ప్రజలు

భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం

బొమ్మనహాళ్ మండలంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వీఆర్వోలు అందుబాటలో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఎవరికైనా సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా నా దగ్గరికి వస్తే వాటిని పరిష్కరిస్తా. కొన్ని రెవెన్యూలు గ్రామాలకు వీఆర్వోలు లేకపోవడం వల్ల కొందరికి అదనపు బాధ్యతలు ఇచ్చాం. అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం. -మునివేలు, తహసీల్దారు, బొమ్మనహాళ్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మార్కోనీ (జయంతి)



ఇటలీ దేశానికి చెందిన ప్రముఖ ఆవిష్కర్త గుగిఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ 1874 ఏప్రిల్ 25న జన్మించారు. ఎలక్ట్రికల్ ఇంజనీర్, సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపేందుకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పితామహగా పేరొందారు. ఇతర భౌతిక శాస్త్రవేత్త ప్రయోగాల ఆధారంగా రేడియో ఆవిష్కరించారు. ఇటలీ రాజు కింగ్ విక్టర్ ఇమ్మానుయేల్ 3 ఆయనను 'మార్చీజ్' అవార్డుతో సత్కరించారు. ఎన్నో గౌరవాలు అందుకున్నారు. 1937 జూలై 20న కన్నుమూశారు.

అల్బర్ట్ అలియాండ్రో అండర్‌జో (జయంతి)



ఫ్రెంచ్ దేశానికి ప్రముఖ రచయిత, చిత్రకారుడు అల్బర్ట్ అలియాండ్రో అండర్‌జో 1927 ఏప్రిల్ 25న జన్మించారు. రెనె గాసినీతో కలసి 'ఏస్టిరిక్స్' సిరీస్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. ఆయన రూపొందించిన క్యారెక్టర్‌లు ఒంపా-పా, జెహాన్ పిస్టోలెట్ అండ్ లక్ జూనియర్ ఎంతో పేరొందాయి. ఆయన సాధనలకు లెజియన్ ఆఫ్ హానర్, ది నైట్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ది నెదర్లాండ్స్ లయన్, తదితర అవార్డులు పొందారు. 2020 మార్చి 24న కన్నుమూశారు.

స్వామి సుఖబోధానంద (పుట్టినరోజు)



ఆధ్యాత్మిక గురువుగానే కాక 'మోటివేషనల్ స్పీకర్' గా గుర్తింపు పొందిన స్వామి సుఖబోధానంద 1955 ఏప్రిల్ 25న బెంగళూరులో జన్మించారు. పూర్వ నామము ద్వారకనాథ్. 28వ యేట పూజ్య స్వామి దయానందచే సన్యాసం స్వీకరించారు. ప్రసన్న ట్రస్టు ద్వారా భగవద్గీత, ఉపనిషత్తులను ప్రచారం చేస్తున్నారు. 2005లో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో హిందూయిజంపై ప్రసంగించి ప్రపంచవ్యాప్తంగా పేరొందారు. 'కార్పొరేట్ గురు'గా కూడా పిలుస్తుంటారు. వివిధ భాషల్లో 112కుపైగా పుస్తకాలు రచించారు 'ది యునైటెడ్ నేషన్స్ వరల్డ్ మిలీనియం సమ్మిట్ ఆఫ్ స్పిరిచ్యువల్ లీడర్స్'కు స్వామీజీ ప్రత్యేక అతిథిగా ఉన్నారు.

ఐపీఎల్‌లో అభిమానుల సందడి



చిన్నస్వామి స్టేడియంలో సందడి చేస్తున్న అభిమానులు

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్ మ్యాచ్‌లో అభిమానులు సందడి చేశారు. గురువారం రాయల్ చాలెంజర్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అభిమానులు కేరింతలు కొడుతూ సందడి చేశారు.













ఉత్సాహంగా యువతులు, చిన్నారులు

అదుపు తప్పితే అంతే...



ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

కంప్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యాభ్యాసం కోసం విద్యార్థులకు ఎన్నో కోట్లు రూపాయల్లో మంజూరు చేస్తుంది. కానీ విద్యాబోధనకోసం పాఠశాలలకు, కళాశాలలకు వచ్చే విద్యార్థులకు మాత్రం సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇప్పటికే ఇళ్లకే పరిమితమయ్యారు. విద్యాభ్యాసం పొందాలి నిత్య జీవితంలో ముందడుగు వేయాలని అనుకునేవారు మాత్రం బస్సుల్లో ఫుట్‌బోర్డు పైనా నిలుచుని గమ్యాన్ని చేరుకుని విద్యాభ్యాసంకొనసాగిస్తున్నారు. కంప్లి నుండి బళ్లారికి హోస్పేటకి సరైన సమయానికి బస్సులు లేక గ్రామాల్లోనే విద్యార్థికి ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే సాయంత్రం బళ్లారి నుండి కంప్లికి బస్సులు సౌకర్యం లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. గురువారం ఉదయం హోస్పేటకు వెళ్లేందుకు సమయానికి బస్సులు లేక వచ్చిన బస్సులకు ఫుట్‌బోర్డుపైనే నిలుస్తూ ప్రయాణం చేపడుతూ విద్యార్థులు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. విద్యార్థులు పాడుతున్న కష్టాలను అధికారుల దృష్టికిలో వుంచుకుని బళ్లారి హోస్పేటకు ప్రత్యేక బస్సులు సౌకర్యం కల్పించాలని సంఘ సభ్యులు, నాయకులు కోరారు.

మానవత్వం చాటుకున్న ఉద్యోగులు

● మృతిచెందిన తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



డిపాజిట్ ఫాం అందిస్తున్న తోటి ఉద్యోగులు

కంప్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కుడితిని సమీపంలోని కేపీసీఎల్ బీటీపీఎస్‌లో ఏహెచ్‌పీ యూనిట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగి స్టోర్ కీపర్‌గా పనిచేస్తున్న మృత్యుంజయ అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. వారి కుటుంబాన్ని దృష్టిలో వుంచుకుని తోటి ఉద్యోగులు ఆనంద్ సహకారంతో మరణించిన వారి కుటుంబానికి తోటి ఉద్యోగులు తమ వంతుగా రూ. 50 వేలు సహకారం అంజేశారు. గురువారం కుడితిని పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో మృత్యుంజయ కూతురు పేరుతో డిపాజిట్ చేశారు.యూనిట్ 1 కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇన్‌ఛార్జ్ ఆనంద్ ముందుకొచ్చి మృతి చెందిన మృత్యుంజయని కుటుంబీకుల్ని దృష్టిలో వుంచుకుని ప్రతి సిబ్బందితో సహకారాలు చేపించడంతో కుటుంబీకులు వారికి అభినందనలు తెలిపారు. వారితో పాటు అమరేష్, పరశురామ్, చంద్రిక, అంకిత, తదితరులు పాల్గొన్నారు.

500 జిల్లాల్లో ప్రేమప్రవాహిని ప్రచారం

● ఆరునెలలు శత జయంతి ఉత్సవాలు ● సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్



ప్రేమ ప్రవాహిని కరపత్రాన్ని విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు



నారాయణ సేవలో భక్తులు

పుట్టపర్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రేమ ప్రవాహిని కార్యక్రమం ద్వారా 500 జిల్లాల్లో శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక, ప్రేమతత్వంపై ప్రచారం చేపట్టినట్లు సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్ పేర్కొన్నారు. సాయికుల్వంతులో గురువారం సత్యసాయి 14వ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. మొదట సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. విద్యార్థుల వేద పఠనంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు భక్తులు తమ సంగీతగానంతో అలరించారు. ట్రస్టు సభ్యులు నాగానందం, సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే సేవా కార్యక్రమాల గురించి వివరించారు. సత్యసాయి ప్రేమప్రవాహిని కరపత్రాలను ట్రస్టు సభ్యులు రత్నాకర్, చక్రవర్తి, నాగానందం విడుదల చేశారు. ప్రేమ ప్రవాహిని రథానికి పూజలు చేశారు. అనంతరం హిల్‌వ్యూ స్టేడియంలో భక్తులకు వస్త్రదానం, లడ్డు ప్రసాదం, పులిహోరాను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నారాయణ సేవలో పాల్గొన్నారు. అనంతరం రత్నాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో ప్రేమప్రవాహని రథం ద్వారా సత్యసాయి ప్రేమతత్వాన్ని, ఆధ్యాత్మిక బోధనలను ప్రచారం చేయడానికి ప్రత్యేక రథాలను సిద్ధం చేశామన్నారు. నవంబరు 2026 వరకు 2.50లక్షల కిలో మీటర్లు పర్యటించి గ్రామాలలో సత్యసాయి ప్రేమతత్వాన్ని తెలియజేస్తామన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఆరు నెలలపాటు నిర్వహిస్తామన్నారు. ప్రతివారం ప్రశాంతినిలయంలో భక్తులు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని 2026 నవంబరుకి పూర్తి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సుందరీకరణ కార్యక్రమాన్ని జాతీయ రహదారుల అధికారుల అనుమతులతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరాధనోత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నారాయణ సేవా సంస్థ ప్రతినిధులు

27న నారాయణ సేవా సంస్థ ఆధ్వర్యంలో

కృత్రిమ అవయవాల అమరిక

బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) :మానవత్వం సేవలో నిరంతరంగా పేరొందిన నారాయణ సేవా సంస్థ ఈనెల 27న ఆదివారం ఉచితంగా కృత్రిమ అవయవాల అమరిక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ డైరెక్టర్ భగవాన్ ప్రసాద్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవాన్ ప్రసాద్ మాట్లాడుతూ నారాయణ సేవా సంస్థ 40 ఏళ్ళుగా దివ్యాంగులకు అవసరమైన కృత్రి అవయవాలను సమకూరుస్తోందన్నారు. ఫిబ్రవరి 2న నగరంలో 1050ల మంది శిబిరంలో పాల్గొన్నారన్నారు. వీరిలో రోడ్డు ప్రమాదాలు ఇతరతాత్ర సంఘటనలలో కాళ్ళు, చేతులు కోల్పోయిన వారు ఉన్నారన్నారు. 27న జరిగే శిబిరంలో బెంగళూరుతో పాటు ఏ ప్రాంతానికి చెందిన వారైనా పాల్గొనవచ్చు అన్నారు. ప్రతి మనిషి దైనందిన జీవనంలో సొంతంగా పనులు చేసుకునేలా ఉండాలనే ఆశయంతోనే శిబిరం జరుపుతున్నట్లు తెలిపారు. నారాయణ సేవా సంస్థ బెంగళూరు ఇన్‌ఛార్జ్ ఖుబిలాల్ మెనారియా, ముంబై శాఖ ఇన్‌ఛార్జ్ లలిత్ లోహర్, సామాజిక కార్యకర్త రాకేష్ వైష్ణవ్, గానవి, చంద్రశేఖరయ్యలు పాల్గొన్నారు.

త్వరలోనే స్టేడియం: ఎమ్మెల్యే



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకాలో క్రీడాకారులను దృష్టిలో వుంచుకుని కంప్లి తాలుకా పరిధిలో క్రీడాంగణం నిర్మిస్తామని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. అనంతరం మెట్రిలో ఏర్పాటు చేసిన కిక్రెట్ క్రీడలను ప్రారంబించారు. అనంతరం మాట్లాడుతూ గెలుపు ఓటమి సమానంగా తీసుకోవాలని ఈ క్రీడల వల్ల శారీరక, మానసిక ఒత్తిడులు తొలగిపోతాయన్నారు. బళ్లారి జిల్లా వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు హోసకోటే జగదీష్ నేతృత్వంలో బసవ జయంతి సందర్భంగా గురువారం తాలుకాలోని మెట్రి గ్రామంలో ప్రీమియర్ లీగ్ 5వ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ప్రతి గ్రామంలో హోసకోటి జగదీష్ మాదిరిగానే క్రీడలు ఏర్పాటు చేసి యువతీ యువకుల్లో ఉత్సాహం తీసుకురావాలని తెలిపారు. క్రికెట్ క్రీడల్లో మొదటి బహుమతిగా రూ.21 వేలు, రెండవ బహుమతిగా రూ. 11 వేలు, అందించనున్నట్లు తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పది జట్లు పాల్గొన్నాయి. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ మాజీ సభ్యులు శంకరప్ప, గంగాధర గౌడ, రాజప్ప, హంపారెడ్డి, మంజునాథ, జగదీష్, శివపుత్రప్ప, గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్టాండ్



పెచ్చులూడిన బస్టాండ్ భవనం

గంగావతి రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు నీడనివ్వాల్సిన బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. కొప్పళ జిల్లా హనుమసాగర్ బస్‌స్టేషన్ గోడలలో పగళ్ళు, అపరిశుభ్రంగా మరుగుదొడ్లు, పైకప్పు సిమెంట్‌టైల్స్ పడిపోవడం తదితర సమస్యలు కొట్టుమిట్టాడు తున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న భవనం కారణంగా ప్రయాణికులు భయంగా గడుపుతున్నారు. 1998లో నిర్మించిన బస్‌స్టేషన్ 27సంవత్సరాల నాటిది. ఈ స్టేషన్ నుంచి రోజూ 148కిపైగా బస్సులు వచ్చి వెళ్తుంటాయి. గ్రామీణ పట్టణ పాంతాల నుంచి వేలాది మంది ఈ స్టేషన్‌ను ఉపయోగిస్తున్నారు. కానీ ఇక్కడ సౌకర్యాల కల్పనపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. అమ్మాయిలు , వృద్ధులకు సరైన టాయిలెట్లు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆపరేటర్లు, డ్రైవర్లు తమ విధులు ముగించుకున్న తర్వాత ఉండటానికి విశ్రాంతి తీసుకోవడానికి గదులు లేవు. హనుమసాగర్ బస్టాండ్‌ను త్వరలో హైటెక్‌గా అప్‌గ్రేడ్ చేయాలి. ప్రయాణికులు కూర్చునే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



తలుపులు లేని మరుగుదొడ్లు

జంధ్యం వివాదంపై బ్రాహ్మణుల ఆగ్రహం

సిరుగుప్ప, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సీఈటీ పరీక్షా కేంద్రం వద్ద జంధ్యం వివాదంపై బ్రాహ్మణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణులకు కులగణన సక్రమంగా జరపలేదన్నారు. తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాశ్మీర్‌లో ఉగ్ర దాడులను ఖండించారు. ప్రభుత్వాలు ఈ విషయంపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, ప్రముఖులు పవన్‌కుమార్, వెంకటేష్, మద్వాచార్య మహిళలు పాల్గొని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ సిద్ధార్థకు మనవిపత్రం అందజేశారు.



ఆందోళన చేస్తున్న బ్రాహ్మణ సంఘాల నేతలు

మహిళల అభ్యున్నతికి పూర్తి సహకారం

● దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ ● ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సంఘం ఏర్పాటు

రాయచూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : మహిళల సాధక-బాధకల గురించి తోటి మహిళగా పూర్తి అవగాహన ఉన్న తాను మహిళల హక్కుల పరిరక్షణతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధి కోసం తనవంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ అన్నారు. ప్రభుత్వం మహిళ ఉద్యోగుల సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని గురువారం నగరంలోని రంగ మందిరంలో ఎమ్మెల్యే లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కరెమ్మ నాయక్, మహిళల స్వావాలంభన జీవనమే వారి అభ్యున్నతికి కారణంగా ఉంటుందన్నారు. మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక, చైతన్యం కోసం తమవంతు బాధ్యతలను నిర్భయంగా నిర్వర్తించాలన్నారు. మహిళలకు ఎదురైయ్యే సవాళ్లు సమస్యలు వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకోవల్సిన చర్యల గురించి తాను మహిళల తరఫున చట్టసభలో ధ్వని వినిపించేందుకు సిద్దంగా ఉన్నానన్నారు. తన స్వీయ అనుభవంలో అనేక సవాళ్లను సమస్యలను ఎదుర్కొన్నాని అందరి సహకారంతో ప్రజాప్రతినిధిగా ఉన్న తాను మహిళల సర్వతోముఖాభివృద్ధి కోసం మరింత నిభద్ధతతో పని చేస్తానన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.29	1,578.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	327	167
నీటి నిల్వ (టీఎంసీలు)	6.87	3.77

ఆస్పత్రిలో బాలింత మృతి



శాంత (ఫైల్)

బళ్లారి సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హొసపేట ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం బాలింత మృతి చెందింది. హగరిబొమ్మనహళ్లి తాలూకా దశమాపుర గ్రామానికి చెందిన శాంత(20)కు ఆదివారం సిజేరియన్ ఆపరేషన్ చేశారు. అమెకు ఆరోగ్యకరమైన ఆడశిశువు జన్మించింది. అయితే బుధవారం ఆస్పత్రిలోనే కన్నుమూసింది. సరైన ఆరోగ్య పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఆమె మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై దర్యాప్తునకు ఆదేశించామని, డెలీవరీ చేసిన వైద్యులు సింధు షా, డా. రఘునాథ్, విదుల నుంచి సస్పెండ్ చేశామని జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ అధికారి శంకర్ నాయక్ మీడియాకు తెలిపారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామన్నారు. బాలింత మృతితో ఆస్పత్రి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి.

కాలువలో ట్రాక్టర్ బోల్తా

● మహిళ మృతి.. ఆరుగురికి గాయాలు



కాలువలోకి బోల్తా పడిన ట్రాక్టర్

రాయచూరు ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కూలీలతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్ కాలువలోకి బొల్తాగొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృత్యువాతపడింది. గురువారం సాయంత్రం జిల్లాలోని మస్కి తాలూకా హాలూపూర్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. 15 మంది మహిళ కూలీ కార్మికులతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి కాలువలోకి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న అంబమ్మ(46) అక్కడికక్కడే మృత్యువాత పడింది. మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా వీరిని ప్రాథమిక చికిత్స కోసం కవితాళ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన కవితాళ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి ఆరాధనోత్సవం

పెనుకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా ఆరాధనోత్సవాన్ని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఉదయం సేవాసమితిసభ్యులు బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తూ పురవీధుల్లో నగర సంకీర్తన చేశారు. మధ్యాహ్నం ఊరువాకిలి ఆంజనేయస్వామి గుడివద్ద బాబా చిత్రపటానికి పూజలు చేసి భజనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కన్వీనర్ శంకరప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో సత్యసాయిబాబా ఆరాధన ఉత్సవాన్ని గురువారం నిర్వహించారు. సత్యసాయి సేవాదళ్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి, భజనలు, భక్తిగీతాలు ఆలపించారు.



ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ చేపట్టిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు



బీజేపీ ఆధ్వర్యంలో..



ఏబీవీపీ ఆధ్వర్యంలో..

ఉగ్రమూకల్లారా.. ఉపేక్షించం..!

● పహల్గాం ఉగ్ర దాడి అమరులకు అడుగడుగునా నివాళి ● పార్టీలకతీతంగా కదలివచ్చిన నేతలు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉగ్రమూకల్లారా ఇక ఉపేక్షించం.. పిరికి పందల్లా దొంగ దెబ్బ తీస్తారా.. ఖబడ్దార్ కాస్కోండి అంటూ నినాదాలు చేస్తూ పహల్గాం ఉగ్రదాడిలో అమరులకు అడుగడుగునా నివాళి అర్పించారు. నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి ఎమ్మెల్సీ వైఎం సతీష్, బీజేపీ ప్రముఖులు కేఎస్ దివాకర్ కొలగల్లు ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు. అమాయక పురుషులపై జరిపిన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నగరంలో దుర్గమ్మ గుడి నుంచి మోతి సర్కిల్ వరకు ప్రదర్శన సాగించారు. కార్యక్రమంలో బీజేపీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో..

జమ్మూ కాశ్మీర్లోని పహల్గాం పర్యాటకులపై ఉగ్రదాడులను ఏబీవీపీ తీవ్రంగా ఖండించింది. జమ్మూకాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగ మేనని, ఉగ్రవాదులు పిరికిపంద చర్యలు మానుకోవాలని వారు హెచ్చరించారు. కాశ్మీర్‌లో భయ భ్రాంతుల్లో కలిగించిన నేపథ్యంలో సృష్టించిన ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన కఠినమైన చర్యలు తీసుకుని తగిన సమాధానం ఇవ్వాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మనవిపత్రం ఉగ్రవాద దాడిని ఖండించాలని మనవి పత్రం అందించారు. కార్యక్రమంలో సురేష్, నవీన్, నాగరాజు, మారుతి, దిలీప్, సాగర్, ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

బళ్లారిసిటీ: కశ్మీర్‌లో ఉగ్రదాడిలో అమరులైనవారికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. బుధవారం రాత్రి ఉగ్రదాడిని ఖండిస్తూ డీఎస్ఎస్ మహిళా అధ్యక్షురాలు శాంతమ్మ, జిల్లాధ్యక్షురాలు చంద్రకళ నేతృత్వంలో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు కనకదుర్గమ్మదేవస్థానం నుంచి రాయల్ సర్కిల్, మోతీ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ.. టూరిస్టులపై ఉగ్రదాడి పిరికిపంద చర్యగా భావించాలని, దీనిపై తక్షణం ప్రజా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, కారకులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్‌కుమార్ జయంతి



రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్



కన్నడ సంఘాల నివాళి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా అభిమానులు ఘననివాళి అర్పించారు. గురువారం వివిధ కన్నడ సంఘాల నాయకులు, ఆఫీస్ బేరర్లు నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ పార్క్‌లోని రాజ్‌కుమార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కమిషనర్ మహమ్మద్ జుబేర్ మాట్లాడుతూ వెండితెరపై తనదైన నటనా శైలిలో సంచలనం సృష్టించిన రాజ్‌కుమార్ జాతీయ స్థాయిలో కన్నడ భాష గౌరవాన్ని పెంపొందించారన్నారు. కల్యాణకర్ణాటక పోరాట సమితి బళ్లారి జిల్లాధ్యక్షుడు సిరిగేరి పన్నరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో రాజ్‌కుమార్ జయంతిని కన్నడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కన్నడ సినిమాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్ అభిమానులు, కళాశాల విద్యార్థులు, ప్రజలు, రాజకీయ నాయకులు, అధికారులు, అన్ని విభాగాల సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రాయచూరు: డా.రాజ్‌కుమార్ కన్నడ సినిమా రంగంలో 300కిపైగా కన్నడ చిత్రాల్లో నటించి ప్రపంచ స్థాయివరకు కన్నడంలో ఏకైక నటుడిగా గుర్తింపు పొందారని తహసీల్దార్ సురేశ్ వర్మ అన్నారు. జిల్లా సమాచార శాఖ కార్యాలయం, జిల్లా యంత్రాంగం సంయుక్తాధ్వర్యంలో గురువారం స్థానిక కన్నడ భవనంలో ఏర్పాటు చేసిన డా.రాజ్ 97వ పుట్టినరోజు కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. డా.రాజ్‌కుమార్ చిత్రపటానికి తహసీల్దార్ సురేశ్ వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేశ్ వర్మ మాట్లాడుతూ డా.రాజ్ నటించిన కొన్ని చిత్రాలు సమాజానికి మంచి సందేశాన్నిచ్చాయన్నారు. కార్యక్రమంలో అఖిల కర్నాటక డా.రాజ్‌కుమార్ అభిమానుల సంఘం అధ్యక్షుడు బసవరాజ్ కళస, కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా శాఖ కార్యదర్శి రావుత్‌రావ్ బరూరు తదితరులు పాల్గొన్నారు.



రాయచూరులో అధికారుల నివాళి

త్వరలోనే పురసభగా కుడితిని

కంప్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణ పంచాయతీ నుంచి పురసభగా మారనుందని సమితి అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. పంచాయతీ ప్రాంగణంలో గురువారం స్థాయి సమితి ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు సభ్యులు పాల్గొని పలు తీర్మానాలు చేపట్టారు. ఇప్పటికే 19 వార్డులతో పట్టణ పంచాయతీగా కొనసాగుతుంది. జనసంఖ్య ఆధారంగా వేణి వీరాపురం గ్రామాన్ని కుడితిని కలుపుకుని అప్‌గ్రేడ్ చేపట్టి 23 వార్డులు ఏర్పడి పురసభ అవుతుందని రాజశేఖర్ తెలిపారు. రూ. 1.35 లక్షలతో నగరోత్పన్న నిధులతో పతనం పూర్తిగా అభివృద్ధి చెంది జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దామన్నారు. త్వరలోనే ముగ్గురికి దివ్యాంగులకు త్రిచక్ర సైకిల్ ఆరుగురికి చిన్న పాటి వ్యాపారం కోసం రూ. 25 వేలు చొప్పున సహాయధనం, నూతనంగా రెండు ఆర్‌వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు 15వ ఆర్థిక బడ్జెట్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పూర్తిగా పురసభ అవుతుండటంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం పరిచారు. సమావేశంలో ముఖ్య అధికారి తీర్థప్రసాద్, శారద, వెంకటరమణబాబు, సునీల్ లెనిన్, మంజునాథ్, హాలప్ప, రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్థాయిసమితి అధ్యక్షుడు రాజశేఖర్

బకాయిలు విడుదల చేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కంది మద్దతు ధరను రూ.8000 ప్రకటించిదని, కానీ ప్రభుత్వం కేవలం రూ. 7550 చెల్లించిందని మిగిలిన మొత్తం రూ.450 మంది రైతులకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురువారం పలు డిమాండ్లతో వారు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజులైనా బకాయిలు విడుదల చేయలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర జలాశయం గేట్లన్నీ పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాటిని త్వరగా మరమ్మత్తులు చేపట్టాలన్నాఉ. వర్షాకాలంలో జలాశయానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. వీలైనంత త్వరగా క్రస్ట్ గేట్లను ఏర్పాటు చేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, గ్రీన్ ఆర్మీ వినతిపత్రంలో కోరారు. ఈ అంశంపై అధికారులు త్వరగా చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో వందలాది మంది రైతులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తుందని రైతు నాయకులు జిల్లా అధ్యక్షులు సంగనకల్లు కృష్ణ హెచ్చరించారు. ఈ సందర్భంగా బైలూరు వీరేష్, మారెన్న, యర్రిస్వామి, గాదెలింగ తదితరులు ఉన్నారు.

డెంగీపై నిర్లక్ష్యం వహించరాదు

● జిల్లా వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ అబ్దుల్లా



ప్రజలకు సూచనలు ఇస్తున్న డాక్టర్ అబ్దుల్లా, డా.కాశీప్రసాద్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా జిల్లా అంతటా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఏడీస్ దోమల సంఖ్య పెరిగి డెంగీ కేసులు పెరిగే అవకాశం ఉందని, చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వెక్టర్ ఆధారిత వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా సూచించారు. గురువారం నగరంలోని కౌల్‌బజార్ వీదిలో వైద్య బృందంతో మాట్లాడిన ఆయన సాధారణంగా జ్వరాన్ని విస్మరిస్తాము, ఇది డెంగీ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయరాదన్నారు. మూడు రోజులుగా జ్వరం, తీవ్రమైన తల నొప్పి కళ్ల వెనుక నొప్పి, కండరాల నొప్పులు, కీళ్లలో తీవ్రమైన నొప్పి ఉంటే నిర్లక్ష్యం చేయరాదన్నారు. సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి చికిత్స పొందాలన్నారు. ఆశ్రయ కాలనీ వైద్యాధికారి డాక్టర్ కాశీప్రసాద్ మాట్లాడుతూ ఇళ్లను సందర్శిస్తూ సీసాలో లార్వా (దోమలపిల్లలు)ఎలా సేకరించాలో ఇప్పటికే ప్రజలకు తెలియజేయాలన్నారు. డ్రమ్ములు, పీపాలు, నీటి ట్యాంకులు, రాతి కుండలు, పూల కుండలు మొదలైన ఉపకరణాలను వారానికి ఒకసారి శుభ్రం చేయాలన్నారు. పాత్రలకు కొబ్బరినూనె వాడాలన్నారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్ప, జిల్లా ఎన్వీబీడీసీపీ సలహాదారు ప్రతాప్ ఎ, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ అధికారి దానకుమారి,హెల్త్ ఇన్‌స్పెక్టర్ మహాలింగ, ప్రశాంత్, ఆశా కార్యకర్త సావిత్రి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఆకట్టుకుంటున్న కృష్ణగిరి కొండ శిల



పుట్టగొడుగు ఆకారంలోని శిల



రాయిపై చెట్టు వద్ద పరిశోధనా బృందం

హోసూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి కొండపై ఉన్న పుట్టగొడుగు ఆకారంలో వెలసిన శిల ఆకట్టుకుంటోంది. కృష్ణగిరి చారిత్రక పరిశోధన డాక్యుమెంటేషన్ కమిటీ బృందం గురువారం సందర్శించింది. పెనుమలప్పన ఆలయం, నరసింహస్వామి ఆలయాల మధ్య ఈ శిల ఉంది. బృందంలో కోఆర్డినేటర్ తమిళసెల్వన్, డేవిస్, రవి, నారాయణమూర్తి, గణేశన్, విజయకుమార్, మతివానన్, మారుతి మనోహరన్ లు ఉన్నారు. అడవులు, చెరువుల గురించి పరిశోధన చేయడం ద్వారా ఆయా గ్రామాల చరిత్ర వెలుగు చూస్తుంది. ఇలా కొండపైకి వెళ్లిన వేళ పుట్టగొడుగు ఆకారంలో ఉన్న రాయి బృందాన్ని ఆకట్టుకుంది. అనంతరం సమీపంలోని ఒక చెట్టు రాయి ఆధారంగానే నిలబడింది. చెట్టుకాండం మొత్తం రాయిపైనే ఉండడం గమనార్హం. చెట్టు బలమైన వేళ్లు భూమిలో ఉన్నప్పటికీ చెట్టు ఉన్న తీరు బృందాన్ని ఆకట్టుకుందని బృందం మీడియాకు వివరించారు.

నేటి నుంచి ఎస్ఐ పరీక్షలకు శిక్షణ

హోసూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా ఉపాధికేంద్రం ఆధ్వర్యంలో ఎస్సై పరీక్షలకు ఉచిత శిక్షణా తరగతులను ఈనెల 25న ప్రారంభించనున్నట్టు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ సెలెక్షన్ బోర్డు ప్రకటించిన మేరకు ఎస్ఐ పోస్టులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు తరగతులను లాంచనంగా ప్రారంభించనున్నారు. విద్యార్థులకు అవసరమైన ఆధునాతన కోచింగ్, రాష్ట్రస్థాయి పరీక్షలు నిర్వహించనున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌ను సందర్శించాలని, మరిన్ని వివరాలకు 04343 291983 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

క్యాన్సర్‌పై జనజాగృతి ర్యాలీ

సిరుగుప్ప, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థన క్యాన్సర్‌పై మహిళలు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. గురువారం తాలుకాలోని టెక్కలకోటలో ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో స్థన క్యాన్సర్ నివారణపై జాగృతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వాస్పత్రిని సందర్శించి స్థన క్యాన్సర్‌కు చికిత్స చేయించుకోవాలని తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్య బృందం

అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి: డీహెచ్‌ఓ



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ డాక్టర్ యల్లా రమేష్ బాబు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల ఆరోగ్య సేవల్లో భాగంగా అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ యల్లా రమేష్ బాబు అన్నారు. జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, హళకుంది గ్రామ పంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిడిగినమొల హలకుంది, హొన్నళ్లి తాండగా, హొన్నళ్లి గ్రామాల ప్రజలకు అత్యవసర సమయాల్లో సహాయపడేందుకు మినీ అంబులెన్స్ సేవలను గురువారం డీహెచ్‌ఓ ప్రారంభించి మాట్లాడారు. తాలూకా పరిధిలోని వీఆర్‌కేపీ స్పాంజ్ అండ్ పవర్ ప్లాంట్, ఎల్‌ఎల్‌పీ సంస్థల ఆధ్వర్యంలో రూ.8లక్షలు వెచ్చించి సీఎస్ఆర్ నిధుల క్రింద అంబులెన్స్ వాహనాన్ని జిల్లా ఆరోగ్య శాఖు అందజేసినట్లు తెలిపారు. వాహనంలో ఇద్దరు శిక్షణ పొందిన డ్రైవర్లు పనిచేస్తున్నట్లు, అంబులెన్స్‌లో ఆక్సిజన్, స్ట్రెచర్ కూడిన బెడ్, సహాయకులు కూర్చోవడానికి అవసరమైన ఆసన వ్యవస్థ కలిగి ఉన్నట్లు తెలిపారు. అత్యవసర సమయంలో జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించేందుకు ఈ అంబులెన్స్ సేవలు ఉపయోగ పడుతాయన్నారు ఇదే సందర్భంగా హలకుంది గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు హొన్నూరమ్మ, ఉపాధ్యక్షులు సువర్ణ, తాలూకా ఆరోగ్య అధికారులు డాక్టర్ ఆర్.అబ్దుల్లా, వైద్యాధికారి డాక్టర్ సంతోష్ బెబ్బాళ్, గ్రామ పంచాయతీ సభ్యులు కేశవ్, జిల్లా ఆరోగ్య శిక్షనాధికారి ఈశ్వర్ హెచ్.దాసప్పవన్, పీడీఓ ఎం.ప్రభాకర్, కార్యదర్శి రుద్రప్ప, వీఆర్‌కేపీ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ గౌరి ప్రసాద్, పీఆర్వో పీరాసాబ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మరియంబి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన వ్యక్తిని చూసి భయపడవద్దని, వారితో ప్రశాంతంగా వ్యవహరించాలని ప్రాణాంతక గాయాలను నివారించడానిక చేతులు కలపాలని జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియంబి సూచించారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లాసర్వే యూనిట్, గుగ్గరహట్టిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ముండ్రగి ప్రాంతంలో గురువారం నిర్వహించిన 'పాము కాటుపై అవగాహన' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాము కాటు వేసినపుడు భయపడడం సాధారణం, ఇది ప్రాణాంతకం కావచ్చన్నారు. విషపూరిత పాటు కాటుకు గురైనపుడు ఆ వ్యక్తిని ఏదైనా వాహనం, 108అంబులెన్స్ ద్వారా కానీ సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ కాశీప్రసాద్ మాట్లాడుతూ కాటు వేసిన ప్రదేశం చుట్టూ గుడ్డ కట్టవద్దని, బ్లేడ్, కత్తితో గాయాన్ని కోయరాదన్నారు. పాము కాటు వేసినపుడు రోగిని కూర్చోబెట్టాలి, తద్వారా కాటువేసిన ప్రాంతం గుండె కింద ఉంటుందన్నారు. రక్తప్రసరణకు ఆటంకం కలిగించే ఏవైన చేతి గడియారాలు, బ్రాస్‌లైట్‌లు,ఉంగరాలు మొదలైన వాటిని తొలగించి కాటువేసిన ప్రాంతం కదలకుండా చూసుకోవాలన్నారు. ఈసందర్భంలో ఆసుపత్రి డాక్టర్ అబ్దుల్లా, ఖలీల్, జిల్లాఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్ప, జిల్లా ఎన్‌సీడీ సలహాదారు డాక్టర్ జబీన్‌తాజ్, జిల్లా అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ విశాలాక్షి, పొగాకు నియంత్రణ విభాగం సరస్వతి, ఎం.సింధు, నవీన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ పత్తార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.